



రబీ నిరాశాజనకం

- సాధారణ విస్తీర్ణం 2,24,930 ఎకరాలు
- ప్రస్తుతం 1,73,062.6 ఎకరాలు
- వర్షాభావ పరిస్థితులతో గణనీయంగా తగ్గిన సాగు
- అపరాల సాగుపై తీవ్ర ప్రభావం



ప్రజాశక్తి – శ్రీకాకుళం ప్రతినిధి

రబీలో ఈ ఏడాది పంటల సాగు అంత ఆశాజనంగా లేదు. వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా ఉండటంతో సాగు గణనీయంగా తగ్గిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రతి ఏడాదీ డిసెంబర్‌లో కురిసే వర్షాలతో నేలలో తేమ శాతం పెరిగి అపరాల సాగుకు దోహదపడుతుంది. ఈ సంవత్సరం వర్షాలు లేకపోవడంతో అపరాల సాగుపై తీవ్ర ప్రభావం చూపిందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రతికూల పరిస్థితులు నెలకొనడంతో పాటు మరోవైపు ప్రభుత్వం నుండి కూడా రైతులకు సహకారం కొరవడుతోంది. పంటల సాగుకు సరిపడా ఎరువులను సరఫరా చేయడంలో విఫలమయ్యిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి

రబీలో సాధారణంగా అన్ని రకాల పంటలు కలిపి మొత్తం 2,24,930 ఎకరాల్లో సాగవుతుంది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు 1,73,062.6 ఎకరాల (76.94శాతం) మేర సాగైంది. వరి సాగు వరకు కొంత పర్వాదలేనిపిస్తోంది. రబీలో వరి సాధారణ సాగు 18,142.5 ఎకరాలు ఉండగా ప్రస్తుతం 18,112.5 ఎకరాలు వరకు వేశారు. మొక్కజొన్న పంట సాగులో పెరుగుదల కనిపిస్తోంది. రబీలో సాధారణంగా 36,182.5 ఎకరాల్లో సాగవుతుండగా ఇప్పటివరకు 41,180 ఎకరాల విస్తీర్ణంలో సాగైంది. రాగులు సాధారణ సాగు విస్తీర్ణం 5,547.5 ఎకరాలు ఉండగా 5,470 ఎకరాల్లో సాగవుతోంది. వేరుశనగ పంట సాధారణంగా 11,157.5 ఎకరాల్లో సాగవుతుండగా ప్రస్తుతం 9,932.5 ఎకరాల్లో సాగైంది.

గణనీయంగా తగ్గిన అపరాల సాగు

డిసెంబరులో వర్షాలు పెద్దగా లేకపోవడంతో అపరాల సాగుపై తీవ్ర ప్రభావం చూపింది. నేలలో తేమ శాతం తక్కువగా ఉండటంతో మినుము, పెసర పంటలను వేయలేకపోయారు. రబీలో పెసర సాధారణ సాగు 52,025 ఎకరాలు ఉండగా ఇప్పటివరకు 31,982.5 (61.47శాతం) ఎకరాల్లో సాగైంది. మినుము సాధారణంగా 76,037.5 ఎకరాలు ఉండగా ప్రస్తుతం 52,387.5 ఎకరాల(70.21శాతం)మేర సాగైనట్లు నమోదైంది. చెరకు పంట కూడా గణనీయంగా తగ్గింది. రబీలో సాధారణ సాగు 4,367.5 ఎకరాలు ఉండగా ఇప్పటివరకు కేవలం 690 ఎకరాలు (15.80శాతం) సాగైంది. నువ్వులు పంటను సాధారణంగా 15,330 ఎకరాల్లో వేస్తుండగా ప్రస్తుతం 3,795 ఎకరాలు (24.76శాతం) మేర వేశారు

కట్టె జనుము సాగుపై ఆసక్తి

ఈ సంవత్సరం రబీలో కట్టె జనుముపై రైతులు ఆసక్తి చూపారు. పంటలకు పచ్చి రొట్ట విత్తనాలుగా రైతులు ఉపయోగిస్తుండటంతో మంచి డిమాండ్ ఉన్నట్లు తెలుస్తోంది. పంట లాభదాయకంగా ఉండటంతో లక్ష్యానికి మించి రైతులు వేసినట్లు అధికారులు చెప్తున్నారు. సాధారణంగా రబీలో 950 ఎకరాల్లో కట్టె జనుము సాగవుతుండగా 7,277.5 ఎకరాలు మేర సాగు నమోదైంది

ఈకెవైసిలో వెనుకబాటు

రబీ పంటల సాగుకు సంబంధించి రైతుల వివరాలు సేకరించడంతో చాలా వెనుకబాటు కనిపిస్తోంది. రబీలో పంటలు సాగు చేసిన 1,23,268 మంది రైతులకు సంబంధించి ఈకెవైసి చేయించాల్సి ఉండగా ఇప్పటివరకు 74,834 మంది (67శాతం) రైతుల నుంచే వివరాలు తీసుకున్నారు. పంటల ఈ–క్రాప్ బుకింగ్‌కు సంబంధించి మాత్రం బాగానే సాగింది. 1,71,055 ఎకరాలను బుకింగ్ చేయాల్సి ఉండగా 1,66,761 ఎకరాలు (97శాతం) బుక్ చేశారు

అంతంత మాత్రంగానే ఎరువుల పంపిణీ

రబీలో అంతంత మాత్రంగానే ఎరువులను పంపిణీ చేశారు. జిల్లాలో ఉన్న అన్ని ఆర్‌బికెలకు కలిపి 742.23 మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే సరఫరా చేశారు. డిఎపి 154.7 ఎకరాలు అందించారు. ఎంఒపి, కాంప్లెక్స్ యూరియా పంపిణీ చేయలేదు. ప్రయివేట్ డీలర్ల వద్ద కొనుగోలు చేద్దామన్నా అక్కడ తగినంత నిల్వలు లేవు. ప్రయివేట్ డీలర్లకు అన్ని రకాల ఎరువులను కలిపి 38,018 మెట్రిక్ టన్నులు సరఫరా చేయాల్సి ఉండగా 21,737 మెట్రిక్ టన్నులను మాత్రమే అందించారు. రైతుల నుంచి అధిక డిమాండ్ ఉన్న యూరియాపై బాగా కోత విధించారు. ప్రయివేట్ డీలర్లకు 22,936 మెట్రిక్ టన్నులను పంపిణీ చేయాల్సి ఉండగా 14,282 మెట్రిక్ టన్నులను మాత్రమే సరఫరా చేశారు. డిఎపి 4,316 మెట్రిక్ టన్నులు కావాల్సి ఉండగా 3,754 మెట్రిక్ టన్నులను సరఫరా చేశారు. ఎంఒపి 1783 మెట్రిక్ టన్నులు ఇవ్వాల్సి ఉండగా 511 మెట్రిక్ టన్నులను పంపిణీ చేశారు. రబీ అవసరాలకు కాంప్లెక్స్ ఎరువులు 5వేల మెట్రిక్ టన్నులు పంపిణీ చేయాల్సి ఉండగా 2,293 మెట్రిక్ టన్నులను అందించారు. సూపర్ పాస్ఫేట్ ఎరువులను 3,983 మెట్రిక్ టన్నులు ఇవ్వాల్సి ఉండగా 898 మెట్రిక్ టన్నులను సరఫరా చేశారు.

నేడు ఎస్‌ఐ ఉద్యోగాలకు
ప్రాథమిక రాత పరీక్ష

ప్రజాశక్తి–శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న పోలీసు సబ్ ఇన్‌స్పెక్టర్ నియామకాలకు ప్రాథమిక రాతపరీక్ష ఆదివారం జరగనుంది. జిల్లాలో పరీక్షల నిర్వహణకు సంబంధించి పోలీసుశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. పరీక్షల నిర్వహణకు జిల్లాలో 21 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో 9,153 మంది అభ్యర్థులు ఆదివారం పరీక్ష రాయాల్సి ఉంది. శ్రీకాకుళం జిల్లా కేంద్రంతో పాటు చిలకపాలెం, ఎచ్చెర్ల ప్రాంతాల్లో 21 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, అలాగే మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు రెండు పూటలా నిర్వహిస్తున్నారు. పరీక్షకు నిర్ధేశించిన సమయానికి ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించబోరు. ఉదయం 9గంటల నుంచి అభ్యర్థులను కేంద్రాల్లోకి అనుమతిస్తారు. 10గంటల తర్వాత ఒక్క నిమిషం దాటినా ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరు. మధ్యాహ్నం జరిగే పరీక్షకు 1.30 నుంచి 2.30 గంటల వరకు మాత్రమే లోపలకు పంపేందుకు అనుమతిస్తారు. అభ్యర్థులు హాల్ టిక్కెట్లతో పాటు ఏదైనా ఒక ఒరిజినల్ గుర్తింపు కార్డు తీసుకెళ్లాల్సి ఉంటుంది. పరీక్షా కేంద్రాలకు సమీపంలోని జిరాక్స్ దుకాణాలు మూసివేయాలని ఇప్పటికే పోలీసుశాఖ ఆదేశించింది. ఎవరైనా కాపీయింగ్, మాల్ ప్రాక్టీసుకు పాల్పడి పట్టుబడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలు చేస్తున్నట్టు పోలీసు శాఖ ప్రకటించింది. పరీక్ష నిర్వహణపై ఇప్పటికే విశాఖ రేంజ్ డిఐజి ఎస్.హరికృష్ణ, ఎస్‌పి జి.ఆర్.రాధిక పరిశీలించారు. ఈ పరీక్షలకు నోడల్ అధికారులుగా డిఎస్‌పి ప్రేమ్ కాజల్, ప్రాంతీయ సమన్వయకర్త వై.శ్రీనివాసరావు, డిఎస్‌పిలు ఎం.మహేంద్ర, బాలరాజు, వాసుదేవ్, వ్యవహరిస్తారు.

పటిష్ట భద్రత మధ్య పరీక్షలు

ఎస్‌ఐ ఉద్యోగ నియామకాల రాతపరీక్షను పారదర్శకంగా నిర్వహించేందుకు పటిష్ట భద్రత ఏర్పాటు చేస్తున్నాం. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, ఎక్కడా అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వ నిబంధనలకు లోబడి పరీక్షా కేంద్రానికి అభ్యర్థులు హాజరుకావాలి. హాల్ టిక్కెట్తో పాటు, ఒరిజినల్ గుర్తింపు కార్డు తప్పనిసరి. మాల్ ప్రాక్టీసుకు పాల్పడితే చర్యలు తప్పవు

-ఎస్‌పి జిఆర్ రాధిక



శ్రీముఖలింగేశ్వరుని ఆలయం వద్ద క్యూలో ఉన్న యాత్రికులు



టెక్కలి: ఎండల మల్లిఖార్జునస్వామిని దర్శించుకుంటున్న యాత్రికులు

ఆలయాలకు పోటెత్తిన యాత్రికులు

- శ్రీముఖలింగేశ్వరుడిని దర్శించుకున్న స్పీకర్, కలెక్టర్, ఎస్‌పి
- కిటకిటలాడిన రావివలస

ప్రజాశక్తి – జలుమూరు, టెక్కలి రూరల్

శివరాత్రి సందర్భంగా శివాలయాలకు యాత్రికులు పోటెత్తారు. జిల్లాలోని శ్రీముఖలింగం, రావిలవలస ఎండల మల్లిఖార్జునస్వామి, శ్రీకాకుళంలోని కోటేశ్వర ఆలయాలతోపాటు, జిల్లాలోని పలు ఆలయాలకు యాత్రికులు భారీగా తరలివచ్చారు. వేకువజామున 2గంటల నుంచే క్యూలైన్లలో బారులు తీరారు. శ్రీకాకుళం నగరంలో ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు వర్షం కురిసింది. వర్షాన్ని సైతం లెక్కజేయకుండా యాత్రికులు స్వామిని దర్శించుకున్నారు.

శ్రీముఖలింగేశ్వర ఆలయంలో ఉచిత, ప్రత్యేక దర్శనాల క్యూలైన్లు కిక్కిరిసి పోయాయి. శనివారం ఉదయం కురిసిన వర్షంలోనే యాత్రికులు తడుచుకుంటూ స్వామిని దర్శించుకున్నారు. క్యూలైనులోని చిన్నారులు, యాత్రికులకు దేవాదాయశాఖ ఆధ్వర్యాన ఆలయ కార్యనిర్వహణ అధికారి పి.ప్రభాకరరావు పాలు, బిస్కెట్లు, మంచినీంటి ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఉచితంగా స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. సత్యసాయి సేవా సిబ్బందితో సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా డిఎస్‌పి శివరామిరెడ్డి ఆధ్వర్యాన నరసన్నపేట సిఐ డి.రాము పర్యవేక్షణలో పటిష్ట భద్రత కల్పించారు.



దర్శించుకుంటున్న స్పీకర్ సీతారాం

ఎంపిపిని అడ్డుకున్న పోలీసులు

ఎంపిపి వాన గోపిని పోలీసులు అడ్డుకున్నారు. శ్రీముఖలింగేశ్వర దర్శనానికి వెళ్తున్న ఎంపిపిని కంచిలి ఎస్‌ఐ చిరంజీవి అడ్డుకున్నారు. ఆయన నేను ఎంపిపి అని చెప్పినా వినిపించుకోలేదు. నాకు మీరు ఎంపిపి అని ఎలా తెలుస్తుంది. ఎస్‌ఐతో ఫోన్ చేయించండి పంపిస్తానని బదులిచ్చారు. అక్కడున్న సర్పంచ్ సతీష్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది ఆయన ఎంపిపి అని చెప్పినా వినలేదు. దీంతో వారి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ పారినాయుడు అక్కడకు వచ్చి దర్శనానికి పంపించినా ఆయన వెనుతిరిగారు. విఐపిలు తప్ప, గర్భగుడిలోకి ఎవరినీ పంపించవద్దని ఉన్నతాధికారుల ఆదేశాల ఉన్నా పోలీసులు బేకాతరు చేశారు. వారి కుటుంబాలనే దక్షిణ ద్వారం మీదుగా గర్భగుడిలోకి పంపడం విశేషం.

దర్శించుకున్న ప్రముఖులు

శ్రీముఖలింగేశ్వరుడిని స్పీకర్ తమ్మినేని సీతారాం, ఎంపీ రామ్మోహన్‌నాయుడు, కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ దంపతులు, ఎస్‌పి రాధిక, బగ్గు రమణమూర్తి, ఆర్‌డి బి.శాంతి, తహశీల్దార్ సత్యం స్వామిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు.

కిటకిటలాడిన రావివలస

ఎండల మల్లిఖార్జునస్వామి ఆలయం యాత్రికులతో కిటకిటలాడింది. శనివారం వేకువజామున 3గంటల నుండే యాత్రికులు స్వామి దర్శనానికి బారులు తీరారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివరాత్రి రద్దీని దృష్టిలో ఉంచుకుని దేవాదాయశాఖ కార్యనిర్వహణాధికారి వి.వి.సూర్యనారయణ తగు చర్యలు తీసుకున్నప్పటికీ టికెట్ల విక్రయ కౌంటర్లు, దర్శన క్యూలైన్లలో తోపులాటలు చోటు చేసుకున్నాయి. వృద్ధులు, వికలాంగుల కోసం ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేయకపోవడంతో పలు ఇబ్బందులను ఎదుర్కొన్నారు. సిఐ సూర్య చంద్రమౌళి ఆద్వర్యాన ఎస్‌ఐ రామకృష్ణ బందోబస్తు నిర్వహించారు. సర్పంచ్ సర్లాన బాలకృష్ణ, చమల్లా మధు తాగునీరు అందించారు.

ఆర్భాటానికే.. ఆర్‌బికెలు!

ఎరువులు, పురుగు మందులకు అవస్థలు

ప్రజాశక్తి – శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ఆర్‌బికెలు ప్రచారానికే పరిమితమవుతున్నాయి. విత్తనం నుంచి విక్రయం దాకా అన్నీ రైతు భరోసా కేంద్రాల ద్వారానే నిర్వహిస్తామని ప్రభుత్వం చెబుతున్న మాటలు క్షేత్రస్థాయిలో అమలు చేయడం లేదన్న విమర్శలు రైతుల నుంచి వ్యక్తమవుతున్నాయి. సకాలంలో రైతులకు ఎరువులు, పురుగు మందులు అందక ప్రైవేటు డీలర్లనే ఆశ్రయించాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు.

మొక్కుబడిగా విత్తనం పంపిణీ

ఉమ్మడి జిల్లాలో ప్రధానంగా ఖరీఫ్, రబీ సీజన్లో వరి, మొక్క జొన్న, వేరుశనగ, అపరాల సాగుకు విత్తనాల కోసం ఏటా రైతులు ఎదురు చూస్తుంటారు. రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా వ్యవసాయశాఖ ఇచ్చిన ఇండెంటు ఆధారంగా విత్తనాలను రైతులకు ఇచ్చేవారు. ఇప్పటికీ అదే విధానం అమలవుతున్నా ఇండెంట్‌ను అనుసరించి రాయితీ విత్తనాల సరఫరా జరగడం లేదన్నది రైతుల ఆవేదన. అది కూడా సీజన్ మొదలైన చాలా రోజుల తర్వాత మొక్కుబడిగా ఇస్తున్నారు. దీంతో రైతులు ప్రైవేట్, దళారుల వద్ద అధిక ధరలకు విత్తనాలు కొనాల్సి వస్తోంది. చిరుధాన్యాలు, కూరగాయలు, ఉద్యాన పంటలకు సంబంధించిన విత్తనాలను సరఫరా చేయాలని రైతుల నుంచి డిమాండ్ ఉంది. కాని ఉద్యాన పంటల సాగు విత్తనాలు ఆర్‌బికెల్లో ఇవ్వడం లేదు.

డబ్బు చెల్లించిన తర్వాతే

పంటకు సకాలంలో ఎరువులు అందించకపోతే దిగుబడి తగ్గిపోతుంది. అవసరానికి అనుగుణంగా అప్పటికప్పుడు ఎరువులు వాడాల్సి ఉంటుంది. ఆర్‌బికెల్లో ఎరువుల నిల్వలు సరిపడా ఉండటం లేదు. రైతు ముందుగా డబ్బులు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి. రైతుల నుంచి ఓ లోడుకు సరిపడా ఆర్డర్లు వచ్చిన తర్వాతే ఆర్‌బికెల నుంచి ఇండెంట్ పెడుతున్నారు. స్టాక్ పాయింట్ నుంచి ఆర్‌బికెలకు చేరుకోవడానికి సగటున వారం రోజుల సమయం పడుతోందని అధికారులే చెబుతున్నారు. దీంతో రైతులు ప్రైవేట్ డీలర్లను ఆశ్రయించాల్సి వస్తోంది. జిల్లాల్లోని ఆర్‌బికెలకు డిఎపి, యూరియా, కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో లేవు. ప్రస్తుతం రబీలో వరితో పాటు మిరప, మొక్కజొన్న పంటలు పండిస్తున్నారు. వీటికి సరపడా ఎరువులు ఆర్‌బికెల వద్ద లేక పోవడంతో ఇబ్బందులు ఎదురువతున్నాయి.

సూక్ష్మ పోషకాలూ అరకొరగానే

ప్రసుత్తం ఆర్‌బికెల్లో డిఎపి, యూరియా, రెండు రకాల కాంప్లెక్స్ ఎరువులు సరఫరా చేసేవారు. అయితే సూక్ష్మ పోషకాల నిల్వలు జిల్లాలో ఎక్కడా దొరకని పరిస్థితి. జిల్లాలో ఉద్యాన పంటలు , రబీ సాగుకు అవసరమైన సూక్ష్మ పోషకాలు ఎంతో కీలకం. జింక్, ఐరన్, మాల్బోడియంతోపాటు కాంపెక్సు ఎరువులు అందుబాటులో ఉంచడం లేదు. దీంతో రైతులు మార్కెట్లో అధిక ధరలు చెల్లించి ఎరువులను కొనుగోలు చేయాల్సి వస్తోంది.



బిల్లుల పెండింగ్

ప్రస్తుతం ఆర్‌బికెల్లో పురుగుమందుల్ని విక్రయించడం లేదు. గతేడాది ఆగ్రోస్ ద్వారా ప్రయోగాత్మకంగా విక్రయించారు. ఈ ఏడాది ఎక్కడా అమ్మకాలు లేవు. గతంలో పురుగు మందుల్ని సరఫరా చేసిన డీలర్లకు ఇంకా బిల్లులు పెండింగ్లో ఉండటంతో సరఫరా నిలిచిపోయినట్లు చెపుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది జీడి తోటలకు అవసరమైన పురుగు మందులను ప్రైవేటు వ్యాపారుల వద్దే కొనుక్కోవాల్సిన పరిస్థితి నెలకొంది. మంచు కారణంగా ఇప్పటికే తెగుళ్ల విజృంభిస్తున్నాయి. ఈ తరుణంలో ఆర్‌బికెల వైపు చూస్తే నష్టపోతామన్న బావనతో ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించి కొనుక్కుంటున్నారు.

పేరుకే పరిమితం

ఎరువుల నిల్వలు ఉండటం లేదు. డబ్బులు చెల్లించిన వారం రోజుల తర్వా త గాని సరఫరా చేయడం లేదు. విత్తనం నుంచి విక్రయం దాకా అన్ని ఆర్‌బికెల్లోనే అని ప్రభుత్వం ప్రచారం చేస్తోం. క్షేత్రస్థాయిలో పరిస్థితులు దానికి భిన్నంగా ఉన్నాయి. ఈ–పంట నమోదులోనూ సిబ్బంది నిర్లక్ష్యం వల్ల రైతులకు తీవ్ర నష్టం జరుగుతోంది.

-కోనారి మోహనరావు, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి

ప్రచారానికే పరిమితమైన కొనుగోళ్లు

పంట పూర్తయింది. ఖరీఫ్‌లో జిల్లా వ్యాప్తంగా సుమారు 8.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రైతులు పండించారు. కానీ అందులో కేవలం 4.50లక్షల మెట్రిక్ టన్ను ధాన్యాన్ని ఇప్పటివరకు కొనుగోలు చేశారు. ధాన్యం కొనుగోళ్లలో ఆర్‌బికెల్లో పనిచేస్తున్న సిబ్బంది పెడుతున్న ఆంక్షలు వల్ల రైతులకు నష్టం జరుగుతోంది. తేమ శాతమని, ఇతర కారణాలు చూపిస్తూ ధాన్యంలో కోతలు విదిస్తున్నారు. ఫలితంగా రైతాంగం పెద్దమొత్తంలో నష్ట పోవాల్సి వస్తోంది.

-కూన రవికుమార్, టిడిపి జిల్లా అధ్యక్షులు

మండలి అభ్యర్థి వేటలో సామాజిక కసరత్తు

వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని స్థానిక సంస్థలు, మండలి ఎన్నికలకు అభ్యర్థుల ఎంపికలో అధికార పార్టీ ప్రధానంగా సామాజిక తరగతి అంశానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు పరిణామాలు చెప్తున్నాయి. జిల్లా నుంచి అధికార పార్టీ టిక్కెట్ కోసం దాదాపు పది మంది ఎదురుచూస్తున్నారు. ఎవరి ప్రయత్నంలో వారు ఉన్నారు. మంత్రుల వెంట, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వెంట, సలహాదారుల వెంట తిరుగుతూ ఎవరి ప్రయత్నాలను వారు చేస్తున్నారు. వారి ప్రయత్నాల్లో ఎవరి అభిప్రాయాలనూ పరిగణనలోకి తీసుకునే పరిస్థితి కనిపించడం లేదని తెలిసింది. జాబితాను తుది రూపంగా ఇచ్చి, అధినేత ముందు పెట్టేందుకు ఇద్దరు మంత్రులతో పాటు సలహాదారు గత కొద్ది రోజులుగా కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. శుక్రవారం జాబితాను వెల్లడించే అవకాశం ఉందని పలువురు సీనియర్లు భావించినా జాబితా బయటకు రాలేదు. శుక్రవారం రాత్రి బాగా పొద్దుపోయిన వరకు కసరత్తు చేసినా తుది నిర్ణయానికి రాలేకపోయారని తెలిసింది. జిల్లాకు సంబంధించి నియోజకవర్గాల వారీ అభ్యర్థుల ప్రతిపాదనలను లోతుగా పరిశీలించి వడపోత ప్రక్రియను ముందుగా చేపట్టినట్లు తెలిసింది. ఇచ్ఛాపురం నియోజకవర్గం నుంచి నర్తు రామారావు పేరు మళ్లీ వినిపిస్తోంది. ఇటీవల యాదవ గర్జన నిర్వహించి తమకు చట్టసభల్లో ప్రజాప్రాతినిధ్యం కల్పించాలని తీర్మానం చేశారు. అధినేత జగన్ ముందు గర్జన కాదు ఆర్జింపు ఉండాలని అప్పట్లో వ్యాఖ్యానాలు వినిపించాయి. అంతేకాదు యాదవ సామాజిక తరగతిలోనూ కుంపట్లున్నాయి. అన్ని పదవులూ రామారావుకేనా, మేం ఏమయ్యామని పదవుల కోసం ఎదురు చూసే వారు చెప్తున్నారు. ఆయన పేరును ఒక మంత్రి కూడా సూచించనట్లు చెప్తున్నారు. అంతేకాదు ఇచ్ఛాపురానికి జెడ్‌పి చైర్‌పర్సన్ పదవి, డిసిసిబి చైర్మన్ పదవితో పాటు మూడు కార్పొరేషన్ చైర్మన్ పదువులన్నాయని కొందరు నేతలు గుర్తు చేస్తున్నారు. ఈ కారణాల దృష్ట్యా ఇచ్ఛాపురానికి పదవి వచ్చే అవకాశాలు తక్కువని చెప్తున్నారు. జిల్లాలో మైనారిటీ తరగతిగా ఉన్న వైశ్య సామాజిక తరగతికి చెందిన అంధవరపు సూరిబాబు తనకు టిక్కెట్ వస్తుందన్న ఆశతో ఎదురుచూస్తున్నారు. గతంలో రామారావు, సూరిబాబులకు అధినేత జగన్ నుంచి భరోసా ఉందని కొందరు నేతలు గుర్తు చేస్తున్నారు. వీరిద్దరికీ ఆ భరోసాతో చైర్మన్ పదవులు సరిపెడతారా, ప్రమోషన్ ఇస్తారా? అన్నది వేచిచూడాల్సి ఉంది. కాపు సామాజిక తరగతిలో శ్రీకాకుళం నుంచి ఎం.వి.పద్మావతి, ఎచ్చెర్ల నుంచి మీసాల నీలకంఠం పేర్లు వినిపిస్తున్నాయి. ఎం.వి.పద్మావతికి కూడా సిఎం నుంచి పదవీ కల్పన భరోసా ఉన్నట్లు తెలిసింది. అయితే ఆ తరగతికి చెందిన పాలవలస విక్రాంత్‌కు ఇప్పటికే ఎమ్మెల్సీ పదవి లభించినందున ఆ రీత్యా చూస్తే కాపు సామాజిక తరగతికి ఎమ్మెల్యే టిక్కెట్ లభించే అవకాశాలు తక్కువని చెప్తున్నారు. జిల్లాలో మరో సామాజిక తరగతి కాళింగ. ఈ తరగతికి కూడా ఇప్పటికే దువ్వాడ శ్రీనివాస్ ఎమ్మెల్సీ అయి ఉన్నందున ఆ తరగతికి చెందిన నేతలకు అవకాశాలు తక్కువని చెప్తున్నారు. టెక్కలి నుంచి పేడాడ తిలక్‌కు తాజాగా సిఎం నుంచి ఎమ్మెల్సీ పదవి ఇస్తానన్న భరోసా ఇచ్చినా అందులో మెలిక ఉంది. దువ్వాడ శ్రీనివాస్‌ను ఎమ్మెల్యేగా గెలుపించుకొని రా ఎమ్మెల్సీని చేస్తానని సిఎం వెల్లడించడం విశేషం. టెక్కలి గ్రూపుల పోరు తగ్గించాలని సిఎం ముందుగా వెల్లడించినా అక్కడి గ్రూపుల్లో ఎలాంటి తరుగుదల కనిపించడం లేదు. ఎవరైనా గోడ దూకినా ఆశ్చర్యపోనవసరం లేదన్న పరిణామాలు కనిపిస్తున్నాయి. జిల్లా నుంచి మరో ఐదుగురు ఎమ్మెల్సీ పదవి కోసం తనదైన శైలిలో ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. ఎన్నికల సంవత్సరం కావడం, స్థానిక సంస్థల నుంచి పెద్దల సభకు ఎంపిక చేయాల్సి రావడంతో ఆచితూచి వ్యవహరిస్తున్నట్లు తెలిసింది. ప్రస్తుత రాజకీయాలు ప్రాధాన్యత దృష్ట్యా భరోసా పొందిన వారని వెనక్కి పెట్టి కొత్త వారిని తెరపైకి తీసుకువచ్చే అవకాశాలు కూడా లేకపోలేదని కొందరు సీనియర్లు చెప్తున్నారు. అభ్యర్థి ఎంపికలో జిల్లాలో సీనియరు నేతల అభిప్రాయాలను తీసుకోవడం తప్ప, ఎలాంటి సిఫార్సులకు అవకాశం లేదని తెలిసింది. వెనుకబడిన తరగతుల అభ్యర్థి ఎంపికలో పరిమితం కాకుండా ఎస్సీ, ఎస్టీ తరగతుల నుంచి ఎవరినైనా అభ్యర్థిని ఎంపిక చేస్తే ఎలా ఉంటుందన్న అభిప్రాయం కూడా అధినేత మదిలో మెదిలినట్లు తెలిసింది. దీంతో జిల్లాలో అందుకు తగ్గ అభ్యర్థి ఎవరున్నారన్న దానిపై సమాచారం ఇప్పటికే స్వీకరించినట్లు తెలిసింది. వెనుకబడిన సామాజిక తరగతుల్లో వెలమ సామాజిక తరగతికి ఎమ్మెల్సీ పదవిని కట్టబెట్టే ఆలోచన చేయడం లేదని తెలిసింది. ఇప్పటికే సీనియర్లు గానూ, మంత్రులుగానూ ఆ సామాజిక తరగతి వారున్నందున ఆ ప్రతిపాదన రాలేదని తెలిసింది. ఎంపిక కసరత్తును పూర్తి చేసి, ఎమ్మెల్సీ అభ్యర్థుల పేర్లను సోమవారం ప్రకటించనున్నట్లు అమరావతి వర్గాల ద్వారా తెలిసింది.

శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థి ఎంపిక ప్రక్రియను కూడా అప్పుడే ప్రారంభించినట్లు తెలిసింది. తాజాగా ధర్మాన ప్రసాదరావు పేరు ముందుకొచ్చినట్లు తెలిసింది. ఆ సమాచారం ఆయన వరకు వచ్చినట్లు తెలిసింది. ఆ ఆలోచన ఉంటే గతంలో వచ్చిన అవకాశాన్ని వినియోగించుకునే వాడిని. ఇప్పుడు ఆ ఆలోచన లేదని సన్నిహితుల వద్ద అన్నట్లు తెలిసింది. పార్లమెంట్ సీటుకు డాక్టర్ దానేటి శ్రీధర్ పేరు వినిపిస్తున్నా ఆయన ఇచ్ఛాపురం శాసనసభా స్థానానికి వెళ్లాలన్న ఆలోచనలో ఉన్నారని ప్రచారం జరుగుతోంది. డాక్టరు శ్రీధర్ ఈసారైనా రాజాకీయాల్లో ముందుకు వస్తారా! లేదా గత ఎన్నికల సమయంలో మాదిరిగా అస్థిరత్వాన్ని పాటిస్తారా! అన్నది చూడాల్సి ఉంది.



టిక్కెట్ల భయాలు

తాజాగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇటీవల నేతలతో సమీక్షా సమావేశం నిర్వహించి పనితీరు బాగాలేని వారికి టిక్కెట్లు ఇచ్చే అవకాశం లేదని స్పష్టం చేసినట్లు తెలిసింది. 151 మంది ఎమ్మెల్యేలు మిగిలిన ఇన్‌ఛార్జిల్లో మొత్తం 36 మంది పని తీరు బాగాలేదని ప్రకటించినట్లు తెలిసింది. మరో మూడు నెలలు చూసి కొత్త వారిని నియమిస్తామని సిఎం స్పష్టం చేసినట్లు సమాచారం. ఆ 36 మందిలో జిల్లాకు చెందిన వారూ ఉన్నారా! లేదా! అన్నది స్పష్టంగా తెలియరాలేదు. అయినప్పటికీ జిల్లాలో కనీసం ఇద్దరు అభ్యర్థులను మార్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు. పరిణామాలు చెప్తున్నాయి. టెక్కలి నియోజకవర్గానికి సంబంధించి అత్యంత కీలకమైన వ్యక్తి అమరావతి వెళ్లి సిఎంను ఇటీవల కలిసినట్లు తెలిసింది. తన మనసులోని మాటను సిఎం ముందు వెల్లడించడంతో ఆయన ఆలోచనలో పడ్డట్లు అత్యంత విశ్వసనీయంగా తెలిసింది. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో టెక్కలిలో జరిగిన పరిణామాలను పూసగుచ్చి వివరించినట్లు తెలిసింది. ఆ సమయంలో ఎవరూ ఊహించని దాన్ని వెంటబెట్టుకొని వెళ్లినట్లు తెలిసింది. ఆ విషయాన్ని ముందుగా గుర్తించిన ఉన్నతాధికారి ఒకరు సున్నితంగా మందలించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. మాట తప్పడం, మడమతిప్పడం అలవాటు లేదన్న ముఖ్యమంత్రి టెక్కలి సీటు విషయంలో కట్టుబడి ఉంటారా! తప్పుకుంటారా! అన్నది ముమ్మందు తెలుస్తుంది. సిఎం భరోసా ఇచ్చినా అవసరమైతే చేతులు కలపడం తప్పా, మనసులు కలిపే పరిస్థితి లేదన్నది ఐప్యాక్ బృందం నివేదిక కూడా అధినేత ముందుకు వెళ్లినట్లు తెలిసింది. అందులో భాగంగానే జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కుటుంబసభ్యులతో కలిసి అరసవల్లి వచ్చినప్పుడు ప్రత్యేకంగా పేడాడ తిలక్ వచ్చి, ఆయనను కలవడం ప్రాధాన్యత సంతరించుకుంది. జిల్లాలో శ్రీకాకుళం మినహా, అన్ని నియోజకవర్గాల్లోనూ గ్రూపుల గోల సమసిపోయే పరిస్థితి కనిపించడం లేదు. ఇన్‌ఛార్జి మంత్రి బొత్స సత్యనారాయణ మనసులోని పగుళ్ల కప్పే ప్రయత్నం చేస్తున్నా కొత్త పగళ్ల పుట్టుకొస్తున్నట్లు తెలుస్తోంది. ఫ్యానుగాలిలో ప్రజలు ఎలా ఉన్నా నేతలు మాత్రం చమట్లు పట్టే పరిస్థితులు ముమ్మందు మరింత ఎక్కువ అయ్యే పరిస్థితి కనిపిస్తోంది.

- సత్తారు భాస్కరరావు

నల్గొండలో జిల్లావాసి మృతి

(6లో)

టిడిపి నాయకుల నిరసన



జాతీయ కౌన్సిల్‌లో పాల్గొన్న 'గంగరాపు' దంపతులు (ఇన్‌సెట్)లో ఎన్నికైన సింహాచలం

వ్య.కా.స. జాతీయ కౌన్సిల్ సభ్యునిగా సింహాచలం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కౌన్సిల్ సభ్యునిగా గంగరాపు సింహచలం ఎన్నికయ్యారు. ఈ నెల 15 నుంచి 18 వరకు నాలుగు రోజుల పాటు కలకత్తా (హౌరా)లో నిర్వహించిన వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ మహాసభల్లో ఆయనను ఎన్నుకున్నారు. ఈ మహాసభలకు దేశవ్యాప్తంగా వందలమంది ప్రతినిధులు పాల్గొన్నారు. శ్రీకాకుళం జిల్లా నుంచి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాపు సింహాచలం, రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగరాపు ఈశ్వరమ్మ పాల్గొన్నారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా 46 మంది ప్రతినిధులు హాజరయ్యారు. దేశ వ్యాప్తంగా నలుమూలల నుంచి హాజరైన ప్రతినిధులు వ్యసాయరంగంలో వస్తున్న మార్పులు, వ్యవసాయ కార్మికులకు ఎదురవుతున్న సవాళ్లు, భవిష్యత్ కర్తవ్యాలను చర్చించారు. భవిష్యత్ కర్తవ్యాలు వచ్చే మూడేళ్లలో అమలు చేసేందుకు నూతన నాయకత్వాన్ని ఎన్నుకున్నారు. అందులో భాగంగా శ్రీకాకుళం జిల్లాకు చెందిన గంగరాపు సింహచలంను జాతీయ కౌన్సిల్‌కు ఎన్నుకున్నారు.



చెరుకు గడను కొడుతున్న శ్రీనివాస్

ఎమ్మెల్సీ ఆటవిడుపు

టెక్కలి : అధికార పార్టీకి చెందిన వైసిపి నాయకులు, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ మహశివరాత్రి సందర్భంగా శనివారం ఆటవిడుపు కార్యక్రమం చేపట్టారు. వైసిపి కార్యక్రమాల్లో నిరంతరం బిజీగా ఉండేవారు. శివరాత్రి సందర్భంగా శనివారం ఎమ్మెల్సీ శ్రీనివాస్, జడ్‌పిటిసి దువ్వాడ వాణి దంపతులు మండలంలోని అక్కవరం పంచాయతీ శ్యాంసుందరాపురం సమీపంలో ఉన్న జగతి కొండపై ఉన్న జగదీశ్వరస్వామి ఉత్సవాల్లో పాల్గొన్నారు. దర్శనం అనంతరం అక్కడే ఉన్న చిరు వ్యాపారులను పలకరించి వారితో కొద్ది సేపు ముచ్చటించారు. అనంతరం అక్కడే ఉన్న చెరుకు గడల వ్యాపారితో క్షేమ సమాచారాలు తెలుసుకున్నారు. చెరుకు గడను ముక్కలు చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. కొద్ది సేపు ఆనందపరిచి ఆటవిడుపు కార్యక్రమం చేపట్టారు.



స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్న మోహనరావు

స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

స్థానిక లాలపేట సామాజిక భవనంలో నియోజకవర్గంలో 180 మంది శ్రీశయనలు పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఇంగ్లీష్, తెలుగు మీడియంల్లో స్టడీ మెటీరియల్స్‌ను శనివారం పంపిణీ చేశారు. పట్టుదల, అంకితభావంతో చదివి పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాదించాలని కోరారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఉపకార వేతనాలు శ్రీశయన చైతన్య దీపిక, కౌండిన్య ఎడ్యుకేషన్ ట్రస్టు తరపున అందజేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షులు దేవాడ మోహనరావు, పెద్దలు పైల గిరిబాబు, సిందిరి మోహనరావు, దుద్ది వీర్రాజు, దుగానా లోకనాథం, మరిడి జోగారావు, పైల రమేష్, బొమ్మిడి దిలీప్ పాల్గొన్నారు.

అరసవల్లి సందర్శన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని భూహక్కు స్పెషల్ ఆఫీసర్ బి.సుబ్బారావు కుటుంబ సభ్యులతో కలిసి శనివారం సందర్శించారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ సంప్రదాయ బద్ధంగా స్వాగతించారు. ఆలయంలో స్వామివారికి నిర్వహించే పలు సేవల్లో పాల్గొన్న అనంతరం అనివేటి మండపంలో ఇఒ వి.హరిసూర్యప్రకాష్ స్వామివారి జ్ఞాపికను అందజేశారు. అలాగే రాష్ట్ర శాసనమండలి సభ్యులు పి.వి.వి.సూర్యనారాయణరాజు కుటుంబ సభ్యులతో కలిసి అరసవల్లి సందర్శించారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వరరావు, బి.ఎస్.చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

టిడిపి నాయకుల నిరసన

ప్రజాశక్తి- ఆమదాలవలస

మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు పర్యటనను అడ్డుకోవడం దుర్మార్గమైన చర్య అని టిడిపి నాయకులు మొదలవలస రమేష్, తమ్మినేని విద్యాసాగర్ అన్నారు. శుక్రవారం పశ్చిమగోదావరి జిల్లా అనపర్తి పట్టణంలో చంద్రబాబు నాయుడు సమావేశాన్ని అడ్డుకోవడాన్ని నిరసిస్తూ శనివారం పట్టణంలోని టిడిపి కార్యాలయం నుంచి ఆర్‌టిసి కాంప్లెక్స్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాక్షేత్రంలో సమావేశాలను పర్యటనను అడ్డుకోవడం ప్రభుత్వానికి తగదన్నారు. 14 ఏళ్లముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తికే రాష్ట్రంలో రక్షణ, స్వేచ్ఛ లేకుంటే సామాన్యుల పరిస్థితి ఏమిటని ప్రభుత్వానికి ప్రశ్నించారు.



ఆమదాలవలస : ర్యాలీ నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు నూక రాజు, రాష్ట్ర కార్యదర్శి బోనెల అప్పారావు, ఎంపిటిసి గొర్లె సూర్యం, సర్పంచ్‌లు బొడ్డేపల్లి గౌరీపతి, గొండు రమణ, యండ అప్పలనాయుడు, గురుగుబెల్లి నాగేశ్వరరావు, దవళ అప్పలనాయుడు, కూన రమేష్, తమ్మినేని అమర్నాథ్, అప్పలనాయుడు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : చంద్రబాబు బహిరంగ సభను పోలీసులు అక్రమంగా అడ్డుకోవాడాన్ని నిరసన తెలియజేస్తూ స్థానిక అంబేద్కర్ చిత్రపటం వద్ద కొవ్వొత్తులు వేలిగించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, టిడిపి బిసి అధ్యక్షులు ఉంగటి రమణ, కె.బాలరాజు, నక్క రామారావు, రాంఆబు, పెద్దయ్య, భాస్కర్ మోహన్ పాల్గొన్నారు.



కోటబొమ్మాళి : విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బూర్జ : బూర్జలోని అంబేద్కర్ విగ్రహానికి టిడిపి నాయకులు వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో జెడ్‌పిటి మాజీ సభ్యులు అనెపు రామకృష్ణ, బూర్జ ఎంపిటిసి చక్కెర పోలునాయుడు, కడగల కృష్ణ, లంక జగన్నాథంనాయుడు, కోడి గోపి, దుర్గారావు పాల్గొన్నారు.

టెక్కలి : స్థానిక అంబేద్కర్ విగ్రహానికి టిడిపి నాయకులు వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌సి సెల్ విభాగం జిల్లా అధ్యక్షులు మట్ట పురుషోత్తం, హనుమంతు రామకృష్ణ, మామిడి రాము, మహిళా విభాగం అధ్యక్షులు మెండ దమయంతి, మళ్లా బాలకృష్ణ, బెహరా ఖాళీ, మల్లిపెద్ది మధు, కోళ్ల కామేష్, మణి పాల్గొన్నారు.

కోటబొమ్మాళి : స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉన్న అంబేద్కర్‌విగ్రహానికి టిడిపి నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. టిడిపి మండల అధ్యక్షులు బోయిన రమేష్, మాజీ ఎంపిపి తర్ర రామకృష్ణ, గోవింద, సునీల్ పాల్గొన్నారు.



బూర్జ : విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కల్వర్టు పనుల్లో నాణ్యత డొల్ల!

- కొరవడిన పర్యవేక్షణ
- కాంట్రాక్టర్ ఇష్టారాజ్యం



రాళ్లు తేలిన నాగావళి ఓపెన్ హెడ్ గోడ

ప్రజాశక్తి- బూర్జ

ప్రభుత్వం మంజూరు చేస్తున్న పనుల్లో అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యంతో పనుల్లో అవకతవకలు బహిర్గతం అవుతున్నాయి. మండలంలోని అల్లినలో నిర్మిస్తున్న జగనన్న కాలనీకి రహదారి, కల్వర్టుల నిర్మాణాలకు గృహ నిర్మాణశాఖ నుంచి రూ.25 లక్షలు నిధులు మంజూరయ్యాయి. దీంతో కాంట్రాక్టర్ పనులు చేపట్టారు. వంద మీటర్ల రహదారి, రెండు కల్వర్టులు రిటర్నింగ్ వాల్స్ నిర్మిస్తున్నారు. అయితే ఈ పనుల్లో పంచాయతీరాజ్‌శాఖ అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో కాంటాక్టర్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. నిర్మాణం చేపట్టిన కల్వర్టు రిటర్నింగ్ వాల్స్‌లో నాణ్యత కొరవడిందని గ్రామస్తులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ పనులను మూడో వ్యక్తి కాంట్రాక్టర్ పనులు చేపట్టినట్లు తెలుస్తోంది. కాంట్రాక్టర్ ఇష్ట రాజ్యాంగ వ్యవహరించడంతో పనుల్లో నాణ్యత కరువైందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పనుల్లో నాణ్యత కొరవడకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఇదే విషయాన్ని పంచాయతీరాజ్‌శాఖ ఇంజనీర్ వావిలపల్లి మౌనికను వివరణ కోరగా... తాము అనునిత్యం పనులను పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. అలాగే పనుల్లో ఎక్కడ రాజీ పడకుండా నాణ్యత కరువకుండా చూస్తున్నామని పేర్కొన్నారు. పనుల్లో నాణ్యత కొరవడితే సహించేది లేదని స్పష్టం చేశారు.



మాట్లాడుతున్న సిద్ధార్థ

రుణాలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి- టెక్కలి

రైతులకు బ్యాంకులు అందించే రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జిల్లా రీజనల్ మేనేజర్ సిద్ధార్థ అన్నారు. మండలంలోని అక్కవరం పంచాయతీ శ్యాంసుందరాపురంలో సర్పంచ్ పొట్నూరు భూలక్ష్మి అధ్యక్షతన శుక్రవారం రాత్రి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు తీసుకున్న రుణాలను ఎప్పటికప్పుడు వాయిదాల వారీగా చెల్లించి బ్యాంకు అభివృద్ధికి సహకరించాలని కోరారు. డ్వాక్రా, స్వయంశక్తి సంఘాలకు చెందిన మహిళలూ తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలన్నారు. బ్యాంకు మేనేజర్ ఎం.రవికుమార్ మాట్లాడుతూ బ్యాంకు దత్తత తీసుకున్న గ్రామాల్లో ఉన్న లక్ష్యాలను చేరుకునే క్రమంలో భాగంగా వారిలో చైతన్యం తీసుకొస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు అందించిన రుణాలు వివరాలను బ్యాంకు ఫీల్డ్ అధికారి తాతారావు వివరించారు. కార్యక్రమంలో బ్యాంకు అధికారి శ్రీనివాసరావు, గ్రామస్తులు అప్పలనాయుడు, ఆరంగి శ్రీనివాసరావు, రాములు, గొల్లపల్లి కాంతారావు పాల్గొన్నారు.

పలువురి ఆర్థికసాయం

టెక్కలి : మండలంలోని నర్సింగపల్లికి చెందిన రాంబాబు ఛారిటబుల్ ట్రస్టు తన ఔధార్యాన్ని చాటుకుంది. గ్రామానికి చెందిన పడ్డ చిన్నవాడు కేన్సర్ వ్యాధితో పడుతున్నాడు. వైద్యం చేయించుకోవడానికి ఆర్థిక స్తోమత లేకపోవడంతో దాతల కోసం తల్లిదండ్రులు ఎదురు చూస్తున్నారు. విషయం తెలుసుకున్న ట్రస్టు సభ్యులు రూ.59 వేలు విరాళాలు సేకరించి శనివారం అందించారు. ట్రస్టు నిర్వాహకులు వై.షణ్ముఖరావు, సభ్యులు పాల్గొన్నారు.

బూర్జ : రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని తోటి స్నేహితులు శనివారం అందజేశారు. మండలంలోని తుడ్డలికి చెందిన కాద వెంకన్న గత నెలలో సంభవించిన రోడ్డు ప్రమాదంలో



టెక్కలి : నగదు అందజేస్తున్న సభ్యులు

మృతి చెందాడు. విషయం తెలుసుకున్న స్నేహితులు తల్లడిపోయారు. మిత్రులంతా కలిసి రూ.20 వేలు సేకరించి ఆ మొత్తాన్ని మృతు వెంకన్న కుమార్తె రాఘవి పేరున యూనియన్ బ్యాంకులో ఫిక్సెడ్ డిపాజిట్ చేసి సంబంధిత బాండ్‌ను కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో దిలీప్‌కుమార్, మల్లీశ్వరరావు, రమేష్, సీతారామరాజు పాల్గొన్నారు.



మందులు అందజేస్తున్న వైద్య సిబ్బంది

వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

జనసేన పార్టీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ తిప్పన దుర్యోధనరెడ్డి ముందస్తు పుట్టిన రోజు సందర్భంగా నియోజకవర్గ పరిధి లొద్దపుట్టిలో తిప్పన సురేష్, శ్రీకాకుళం మెడికవర్ ఆస్పత్రి సౌజన్యంతో, అలాగే ధర్మపురంలో రామకృష్ణ, వాసు, పురుషోత్తం జనసైనికులు సహాయంతో రాగోలు జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యాన శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ మేరకు వైద్యులు రస్క, భూపతిలు 450 మంది రోగులకు బిపి, సుగర్, ఇసిజి, కీళ్ల నొప్పులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు దాసరి రాజు, రోకళ్ల భాస్కర్, దుంగు భాస్కర్, గ్రామస్తులు హేమంత్, దివాకర్, బోనమాలి పాల్గొన్నారు.



కన్యాదానం చేస్తున్న కూర్మారావు, విజయభారతి

ఎపిఎం కన్యాదానం

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని శ్రీహరిపురానికి చెందిన బుడుమూరు ధనలక్ష్మి భర్త చనిపోవడంతో ఆమె కుమార్తె జీవనజ్యోతి తరపున ఎపిఎం పైడి కూర్మారావు, భార్య విజయ భారతి దంపతులు శనివారం కన్యాదానం చేశారు. బూర్జ మండలం ఒపివాడ వెంకంపేట గ్రామ సంఘంలో జీవనజ్యోతి విఒఎగా పనిచేస్తుంది. అదే గ్రామానికి చెందిన గురుగుబెల్లి వసంతకుమారి, నర్సింగరావునాయుడుల ఏకైక పుత్రుడు వెంకట అప్పలనాయుడు చిన్నతనం నుంచి తనకు మాటలు రావు. అధైర్య పడకుండా ఉన్నత విద్యను అభ్యసించాడు. విభిన్న ప్రతిభావంతుల పోస్టులో ప్రతిభ కనబరిచి స్వయంగా కలెక్టర్ ద్వారా పోస్టింగ్ ఆర్డర్ పొందారు. బూర్జ మండల పరిషత్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. వీరిద్దరికీ ఆయా కుటుంబ సభ్యులు పెళ్లి చేసేందుకు నిర్ణయించారు. పెళ్లి కుమార్తెకు తండ్రి లేకపోవడంతో స్థానిక విజయలక్ష్మి కళ్యాణ మండపంలో ఎపిఎం దంపతులు కన్యాదానం చేశారు.



నల్గొండలో జిల్లావాసి మృతి

లావేటిపాలెంలో విషాదం

ప్రజాశక్తి- లావేరు



శ్రీధర్ (ఫైల్)

మండల కేంద్రం లావేరు పంచాయతీ పరిధిలోని లావేటిపాలెంకు చెందిన యినపకుర్తి తిరుపతిరావు చిన్న కుమారుడు శ్రీధర్ (27) శనివారం తెల్లవారి తెలంగాణ రాష్ట్రంలోని నల్గొండ జిల్లా బి.బి.నగర్ రైల్వే స్టేషన్ పరిధిలో పట్టాలపై రెండు ముక్కలై మృతి చెందారు. ఈ ఘటన తెలిసిన వెంటనే మృతుని తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే... ఈ నెల 14న విజయవాడ వెళ్లి అక్కడ నుంచి 17న హైదరాబాద్ సొంత పనులపై వెళ్లారు. అదే రోజు సాయంత్రం తన తండ్రికి ఆరున్నర గంటల సమయంలో ఫోన్‌చేసి మాట్లాడారు. నేను మరో అర్ధ గంటలో రైలు దిగిపోతానని చెప్పి ఫోన్ పెట్టేశాడు. ఆ తర్వాత కొంత సమయం తర్వాత తిరుపతిరావుకు తండ్రి ఫోన్ చేయగా పనియలేదు. శనివారం ఉదయం 6.30 గంటలకు లావేరు పోలీసులు ఫోన్ చేశారు. మీ అబ్బాయి నల్గొండ జిల్లా బి.బి.నగర్ రైల్వే స్టేషన్ సమీపంలో పట్టాలపై మృతి చెందినట్లు తండ్రి తిరుపతిరావు తెలిపారు. హఠాత్తుగా మృతి చెందిన విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు కుటుంబ సభ్యులు రోదనలు చూపరులను కన్నీరు పెట్టేస్తున్నాయి. మహాశివరాత్రి పర్వదినం రోజున ఇటువంటి దుర్వార్థ తెలిసి తాము ఎవరుకోసం బతకాలని బోరున విలపిస్తున్నారు. ఆ తల్లితండ్రులను ఓదార్చడం ఎవరు తరమూ కాలేదు. దీంతో గ్రామంలో విషాధ చాయలు అలముకున్నాయి

గాయపడిన మహిళ మృతి



రమ (ఫైల్)

మెళియాపుట్టి : మండలంలో జాడుపల్లి ప్రాథమిక పాఠశాలలో ఎండిఎం మధ్యాహ్న భోజన పథకం కార్మికురాలు మల్లిపెద్ది రమ (52) కాలిన గాయాలతో శనివారం కెజిహెచ్‌లో శనివారం మృతి చెందింది. ఈ నెల 14న పాఠశాలలో కట్టెల పొయ్యిపై వంట చేస్తుండగా ఆమె చీరకు నిప్పు అంటుకుంది. వెంటనే కుటుంబ సభ్యులు శ్రీకాకుళం జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రభుత్వం చికిత్స అనంతరం అక్కడి నుంచి విశాఖ కెజిహెచ్‌కు తరలించారు. ఐదు రోజుల పాటు చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృత్యువాత పడింది. మృతురాలికి భర్త రమణమూర్తి, ఇద్దరు కుమాలు, కుమార్తె ఉన్నారు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేశారు.



నిందితుడిని ప్రవేశపెడుతున్న పోలీసులు

నిందితుడు అరెస్టు

ఆమదాలవలస : పురపాలక సంఘ పరిధిలోని ఐదో వార్డు సొట్టవానిపేటలో ఉన్న టి.జి.నగర్‌లో శుక్రవారం భార్యను గాయపరిచి, కుమార్తెను హత్య చేసిన కేసులో నిందితుడు కొలుసు రామారావును అరెస్టు చేశామని సిఐ కె.పైడయ్య తెలిపారు. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం నిందితుడిని విలేకరుల ముందు ప్రవేశపెట్టారు. అనంతరం మాట్లాడుతూ నిందితుడు రామారావుకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారని అన్నారు. అందరూ ఒకే ఇంట్లో నివాసం ఉంటున్నారని తెలిపారు. భార్య సూర్యంకు సతీష్ అనే వ్యక్తితో వివాహేత సంబంధం ఉన్నట్లు అనుమానం పెంచుకున్నాడని తెలిపారు. దీంతో రోజూ భార్యను వేధిస్తుండేవాడని, ఆయా సమయంలో చిన్న కుమార్తె విజయ అడ్డుకునేదని అన్నారు. దీంతో వారిద్దరినీ అంతమొందించడానికి నిర్ణయం తీసుకుని పథకం రచించాడని తెలిపారు. పథకం ప్రకారం కుమారులు ఇంట్లో లేని లేని సమయం చూసుకొని కల్లుగీతకు ఉపయోగించిన కత్తిని వెంట తెచ్చుకొని తల్లీకూతుళ్లను నరికేశాడని తెలిపారు. ఈ ఘటనలో కుమార్తె విజయ అక్కడికక్కడే మృతి చెందిందని, భార్య సూర్యం తీవ్ర గాయాలపాలైందని చెప్పారు. కుమారుడు అప్పన్న వెంటనే చికిత్స కోసం రిమ్స్ ఆస్పత్రికి తరలించాడని తెలిపారు. శనివారం నిందితుడు మెట్టెక్కివలస–2 విఆర్ఒ కె.శ్రీనివాసరావు వద్ద లొంగిపోయాడని, విఆర్ఒ సమాచారం మేరకు నిందితుడిని అరెస్టు చేశామని అన్నారు. అనంతరం కోర్టులో హాజరపరిచి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో హెచ్‌సిలు గోవిందరావు, అప్పారావు, పిసిలు ప్రసన్న, రాధాకృష్ణ పాల్గొన్నారు.

సినీఫక్కీలో సెల్‌ఫోన్ చోరీ

పలాస: స్థానిక పాత జాతీయరహదారి మైస్టోర్ సమీపంలో సినీఫక్కీలో ఓ విశ్రాంత రైల్వే ఉద్యోగి వద్ద గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు బురిడీ కొట్టించి సెల్‌ఫోన్ దొంగిలించిన సంఘటన స్థానికంగా తీవ్ర సంచలనం కలిగించింది. రైల్వే డ్రైవర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన కవిటి జగ్గప్ప సమీపంలో నెహ్రూ నగర్‌లో నివాసం ఉంటున్నారు. ఉదయం శివాలయానికి వెళ్లిమధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో ఇంటికి తిరిగి వస్తున్నారు. ఈ సమయంలో మైస్టోర్ వద్ద ఇద్దరు గుర్తు తెలియని యువకులు తమ బైక్‌ను బోల్తాపడినట్లు నటించారు. నిజమే అనుకొని జగ్గప్ప వారిని పైకి ఎత్తారు. అనంతరం ఇంటికి వెళ్లి చూసే సరికి తన షర్టు పాకెట్‌లోని రూ.19 వేలు విలువైన మోటరోలా సెల్ ఫోన్ మాయమైంది. వెంటనే తేరుకొని ఆ యువకులు పడిపోయిన స్థలం వద్దకు వచ్చే సరికి అప్పటికే వారు పరారయ్యారు. దీంతో జగ్గప్ప పోలీసులను ఆశ్రయించి జరిగిన విషయాన్ని వివరించారు. కాశీబుగ్గ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టిడిపిలోకి పలువురి చేరిక

మెళియాపుట్టి: మండలంలో గొప్పిలి, సంతలక్ష్మీపురం గ్రామాల్లో పాతపట్నం మాజీ ఎమ్మెల్యే కలమట వెంకట రమణ ఆధ్వర్యాన ఇదే కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామాలకు చెందిన పలువురు టిడిపిలోకి చేరారు. వారికి టిడిపి కండువ వేసి ఆహ్వానించారు. చేరిన వారిలో గొప్పిలి మాజీ ఎంపిటిసి, కోట తిరుపతిరావు, సంతలక్ష్మీపురానికి చెందిన నెయ్యల సూర్యనారాయణ తన అనుచరులతో పార్టీలోకి చేశారు. ముందుగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. భాస్కర్‌గౌడ్, బూర్ల లలితకుమారి, ఉర్లన వసంత్, చంద్రశేఖర్, భాస్కరరావు, విష్ణుప్రసాద్ పాల్గొన్నారు.

శివాలయాలు కిటకిట



శ్రీకాకుళం : గుజరాతీపేట బ్రిడ్జిపై నిలిచిన వాహనాలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మహా శివరాత్రి సందర్భాన్ని పురస్కరించుకుని శివాలయాలు యాత్రికులతో కిటకిట లాడాయి. శనివారం వేకువజాము నుంచే పెద్దసంఖ్యలో యాత్రికులు తరలిరావడం పెద్ద సంఖ్యలో బారులు తీరారు. ఆలయ ప్రవేశానికి గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉండాల్సిన పరిస్థితి ఎదురైంది. నగరంలోని గుడివీధిలో ఉన్న ఉమారుద్ర కోటేశ్వరస్వామి, కొన్నావీధిలో ఉన్న రాజరాజేశ్వరీ సమేత భీమేశ్వర ఆలయం, బలగ, హడ్కో కాలనీ, పాత ఫారెస్ట్ కార్యాలయం వద్ద, గుజరాతీపేటలో ఉన్న ఉమా రామలింగేశ్వరస్వామి, పాత శ్రీకాకుళంలో వద్ద ఉన్న ఉమా జటలేశ్వరస్వామి, కాశీవిశ్వేశ్వర ఆలయంలో స్వామి, బాదుర్లపేటలో ఉన్న శివాలయం, అరసవల్లి పార్వతీ సమేత ఉమామహేశ్వరస్వామి, మండల వీధి మండలేశ్వరస్వామి, విశాఖ–ఎ బ్యాంకర్స్ కాలనీ వద్ద ఉన్న శివబాలాజీ, పెద్దపాడు వద్ద ఉన్న మహామృత్యుంజయ పార్వతీ సమేత ఆలయాలకు పెద్ద సంఖ్యలో యాత్రికులు పోటెత్తారు.

అచ్చెన్న, లక్ష్మీదేవి సందర్శన

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు, శ్రీకాకుళం మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి నగరంలోని ఉమారుద్ర కోటేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించారు. వీరికి ఆలయ పాలక మండలి సభ్యులు ఉరిటి శ్రీనివాస్, ప్రధాన అర్చకులు రాంజీ స్వాగతించారు.

కిష్టప్పపేటలో అన్నదానం

మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీకాకుళం మండలం కిష్టప్పపేటలో ఉన్న పార్వతీ సహిత కైలాస ఈశ్వరస్వామి ఆలయంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేకువ జామునుంచే యాత్రికులు ఈ ఆలయానికి పెద్దసంఖ్యలో తరలివచ్చారు. సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు గొండు శంకర్ ఆధ్వర్యాన మూడు రోజుల పాటు ఈ వేడుకలను నిర్వహిస్తున్నారు. వేడుకల్లో వైద్యులు గొండు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. విశాఖపట్నానికి చెందిన వి.ఎస్.మూర్తి శిష్య బృందంతో స్నేహాంజలి ఆర్ట్ అకాడమీ ఆద్వర్యాన సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. సంగిడి, బండరాళ్ల, ఉలవల బస్తా, వెయిట్ లిఫ్టింగ్ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

పాతశ్రీకాకుళం శివజ్యోతి బృందం ఆధ్వర్యాన మహా శివరాత్రి వేడుకల్లో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి, గుంట ముక్కల పాపారావు, మావూరి శేఖర్, మావూరి కుమార్, ముప్పల శ్రీనివాసరావు, అల్లక మల్లేషు, ఆనేం అప్పలరాజు పాల్గొన్నారు.

మజ్జిగ, పులిహోర పంపిణీ

శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని నగరంలోని పలు శివాలయాల వద్ద స్వచ్ఛంద సంస్థలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వచ్చే యాత్రికులకు మజ్జి, తాగునీరు, పులిహోరా, అన్న ప్రసాదం అందజేశారు. నగరంలోని ఉమారుద్ర కోటేశ్వర ఆలయం వద్ద స్థానిక ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ ఆధ్వర్యాన ఉచిత మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు నటుకుల మోహన్, డాక్టర్ బాడాన దేవభూషణరావులు పాల్గొని పర్యవేక్షించారు. అలాగే రాగోలు సమీపాన ఉన్న ఆర్‌టిసి కాలనీలో లయన్స్ క్లబ్ సెంట్రల్ ఆధ్వర్యాన తాగునీరందించారు. కార్యక్రమంలో అధ్యక్షులు హారికాప్రసాద్, పొన్నాడ రవికుమార్, డాక్టర్ చింతాడ కృష్ణమోహన్, వావిలపల్లి జగన్నాథనాయుడు, రౌతు శ్రీనివాసరావు, గణపతి పాల్గొన్నారు. అలాగే 94– 95 ఎంహెచ్ స్కూల్ పూర్వ విద్యార్థులు పులిహోరను పంపిణీ చేశారు.

కవిటి: మహా శివరాత్రిని పురస్కరించుకుని జిల్లాలోని శైవ క్షేత్రాలు కిటకిటలాడాయి. కవిటి మండలంలోని శివాలయాల వద్ద వేకువ జాము నుంచే భక్తులు బారులు తీరారు. ప్రగడపుట్టుగ రామలింగేశ్వర ఆలయం వద్ద లక్ష దీపార్చన చేపట్టి, రుద్రాభిషేకాలు చేశారు. కపాసుకుద్ది, కవిటి, జగతి, బొరివంక, వరక గ్రామాల్లోని శివాలయాలకు యాత్రికులు పోటెత్తారు.

కోటబొమ్మాళి: స్థానిక మల్లేశ్వరస్వామి ఆలయాన్ని సర్పంచ్ కాళ్ల సంజీవరావు దర్శించుకున్నారు. వైసిపి నాయకుడు పాత్రుని లోకేష్ యాత్రికులకు ఉచిత ప్రసాదాలను పంపిణీ చేశారు. కొత్తపేట, కురుడు, సుబ్బరావుపేట, లఖందిడ్డి, గంగరాం, ఊడికలపాడు, యలమంచిలి, జర్జంగి, చవితిపేట ఆలయాలు కిక్కిరిసాయి.

నందిగాం: మండలంలోని నౌగాం, పెద్ద తామరపల్లి, దిమ్మిడిజ్వాల, నర్సిపురం, దిమ్మిలాడ, నందిగాం, హరిదాసుపురం, కాపుతెంబూరు, కొత్తగ్రహారం, పెద్దవానాపురం గ్రామాల శివాలయాల్లో వేకువజామున 4 గంటల నుంచే యాత్రికుల తాకిడి కనిపించింది. ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు చిన్ని జోగారావు యాదవ్, సర్పంచ్ అట్టాడ శ్రీనివాస్, ఎంపిటిసిలు పూడి ఆశారాణి, అంబోడి విష్ణు, పూడి తిరుపతిరావు, ఎల్.సుధాకర్, పినకాన తులసయ్య, బాబూరావు, లఖినాన మన్మథరావు, హరినారాయణ పాల్గొన్నారు.



శ్రీకాకుళం అర్బన్: ప్రసాదాన్ని పంచుతున్న అచ్చెన్నాయుడు

టెక్కలి : మండలంలోని నర్సింగపల్లి, బొప్పాయిపురం, అక్కవరం, పరశురాంపురం, పాతనౌపడ, శాసనాం, జగతి కొండపై ఉన్న శివాలయాలకు యాత్రికులు పోటెత్తారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచ్‌లు పొట్నూరు భూలక్ష్మి, రౌతు జయమోహన్, గుజ్జు మొహన్‌రెడ్డి, విశ్వనాథం పాల్గొన్నారు.

నౌపడ : సంతబొమ్మాళి మండలం మర్రిపాడు, నౌపడ, పాలనాయుడుపేట, మూలపేట, ఆకాశలఖవరం, దండు గోపాలపురంలోని శివాయాలకు యాత్రికుల రద్దీ కనిపించింది. శివరాత్రి సందర్భంగా పాలనాయుడుపేట, భావనపాడు గ్రామాల్లో ఆటలు పోటీలు నిర్వహించారు.

లావేరు : మండలంలోని గురుగుబిల్లి, వెంకటాపురం, మురపాక, అదపాక, బుడుమూరు, తామాడ, కేశవరాయపాలెం గ్రామాల్లోని శివాలయాలు కిటకిటలాడాయి.

పొందూరు : మండలంలోని కృష్ణాపురంలోని ఉమా రామలింగేశ్వరస్వామి, బొట్లపేట వద్ద ఎండల మల్లికార్జునస్వామి, నందివాడలోని బాలయోగి ఆశ్రమం, రాపాక, కింతలి, కనిమెట్ట, పొందూరు, లోలుగు, దల్లవలస, తోలాపి శివాయాలకు యాత్రికులు పోటెత్తారు.

వజ్రపుకొత్తూరు: మండలంలోని గోవిందపురం ఉమాకామేశ్వర, బెండిలో నందికేశ్వర, అక్కుపల్లి శివసాగర్ బీచ్‌లోని నీలకంఠఈశ్వర ఆలయాలు కిటకిటలాడాయి. గోవిందపురంలో స్థానిక సర్పంచ్ పాలిన రమ్యచిరంజీవి, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ పాలిన శ్రావణి, శ్రీనివాస్‌లు దర్శించుకున్నారు.

మెళియాపుట్టి : మండలంలోని మెళియాపుట్టి, చాపర, కోసమాల, పెద్దపద్మాపురం, పెద్దలక్ష్మీపురం, పట్టుపురం, జాడుపల్లి, చీపురుపల్లి, గొప్పిలి, కరజాడ తదితర గ్రామాల్లో శివాలయాల్లో యాత్రికులతో తాకిడితో కిటకిటలాడాయి. అలాగే కోసమాలలో బ్రహ్మకుమారి ఆధ్వర్యాన 87వ త్రిమూర్తి శివజయంతి మహోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.



నౌపడ : క్యూలో ఉన్న యాత్రికులు



కవిటి : దీపాలు వెలిగిస్తున్న యాత్రికులు